నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | గురువారం 29 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఆసిఫాబాద్ కలెక్టర్‌గా స్నేహ శబరీష్

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


స్నేహ శబరీష్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఫిబ్రవరి 28: ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌గా స్నేహ శబరీష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన స్నేహ శబరీష్ ప్రస్తుతం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఇక కుమ్రంభీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

**డీపీవోగా భిక్షపతి**

ఆసిఫాబాద్ డీపీవోగా భిక్షపతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బెల్లంపల్లి డీఎల్పీవోగా పని చేస్తున్న ఆయనను ఆసిఫాబాద్ జిల్లా పంచాయతీ అధికారిగా నియమించింది. ఆసిఫాబాద్ డీఎల్పీవో ఉమర్ హుస్సేన్ ఇన్‌చార్జి డీపీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక పూర్తిస్థాయి డీపీవోగా భిక్షపతి బాధ్యతలు తీసుకోనున్నారు.


మెగా రిటైల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# ఎల్ఆర్ఎస్.. గడువులోపు కష్టమే

## మున్సిపాలిటీలను వేధిస్తున్న సిబ్బంది కొరత

- 11 మున్సిపాలిటీల్లో 66,095 దరఖాస్తులు పెండింగ్
- 50 శాతం నుంచి 60 శాతం వరకే చేయగలమంటున్న అధికారులు
- ఖజానా నింపుకోవడం కోసం సాధ్యం కాని టార్గెట్ పెట్టిందంటున్న పలువురు
- ఎల్ ఆర్ఎస్ రద్దుపై పెట్టుకున్న ఆశలు గల్లంతు.. మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్



మంచిర్యాల, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు కాసుల వేటలో పడింది. పైసల్ లేవు, అప్పులయ్యాయని చెప్పుకుంటూ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు మంగళం పాడే పనిలో పడింది. కాగా.. ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చి జనాలకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ఉచితం చేస్తామని, ఎవ్వరూ ఎల్ఆర్ఎస్ కట్టొద్దని చెప్పి ఇప్పుడు మాట మార్చింది. 2020లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి రుసుం చెల్లించి లే-అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని ప్లేట్ ఫిరాయించింది. దీంతో కాంగ్రెసొస్తే ఉచితంగా లే-అవుట్‌లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని జనాలు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ 31 వరకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండు నెలలపాటు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు స్వీకరించింది. వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించగా.. కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ఆగింది. తాజాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ నెల రోజుల గడువు మాత్రమే ఇవ్వడం, పైగా పైసలు కట్టాలనడంతో గడువు లోపు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

### సిబ్బంది కొరత.. క్షేత్రస్థాయి పరిశీలన ఎలా..

ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ పనిని మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చేస్తారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లే ఇన్‌చార్జులుగా పని చేస్తున్నారు. అనుమతి ఇవ్వాలంటే ఎల్1, ఎల్2, ఎల్3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో ఎల్1 అంటే టీపీబీవోలు క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా? లేకపోతే అన్ని సరిగ్గానే ఉన్నాయా? అన్నది రిపోర్ట్ చేస్తారు. అలా పరిశీలించిన వాటిని రెండో దశలో ఎల్2లో టీపీవో, టీపీఎస్ సరిచూసుకుని ఒకే చేస్తేనే, మూడో దశ ఎల్3లో మున్సిపల్ కమిషనర్ వాటికి ఆమోద ముద్ర వేస్తారు. కానీ.. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఈ పనులు చేసేందుకు సరిపడా సిబ్బంది లేరు. ఉదాహరణకు.. మంచిర్యాల మున్సిపాలిటీనే తీసుకుంటే దాదాపు కొన్ని నెలలుగా ఇక్కడ టీపీవో లేరు. ఇద్దరు టీపీఎస్‌లతోనే నడిపిస్తున్నారు. ఒకరికి మూడు రోజులు బెల్లంపల్లి, మూడు రోజులు మంచిర్యాల, మరొకరికి మూడు రోజులు మంచిర్యాల, మూడు రోజులు నస్పూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు అత్యవసర పనులపై విచారణకు పంపాలనుకున్న సమయంలోనూ టీపీవోలు, టీపీఎస్‌లు ఆ రోజు విధుల్లో ఉండడం లేదు. దీంతో కార్యకలాపాలన్నీ పెండింగ్ పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దాదాపు 66 వేల దరఖాస్తులను నెల రోజుల్లో పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వడమేది సాధ్యం కాదని మున్సిపల్ అధికారులే చెప్తున్నారు. ప్రభుత్వ ఖజానా నింపుకోవడం కోసమే సాధ్యంకాని టార్గెట్‌ను పెట్టిందంటూ పెదవి విరుస్తున్నారు. గతంలో రెండు నెలల టైమ్‌లో సిబ్బంది కొరత లేకుండా ఉన్నప్పుడే ఉమ్మడి జిల్లాలో 22 వేల దరఖాస్తులను క్రమబద్ధీకరించిన అధికారులు, కొన్నింటిలో లోపాలను గుర్తించి రిజెక్ట్ కూడా చేశారు. ఇప్పుడు ఉన్న కొద్దిపాటి సిబ్బందితో నెల రోజుల్లో మూడింతల దరఖాస్తుల పరిశీలన కుదరదని ముఖం మీదే అధికారులు చెప్పేస్తున్నారు. అంతా కలిసిగట్టుగా శ్రమిస్తే 50 శాతం నుంచి 60 శాతం పూర్తి చేయగలమంటున్నారు. అది కూడా జనాలు నిర్దేశిత రుసులు చెల్లిస్తేనే వీలుపడుతుందంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందనేది వేచి చూడాలి.

**ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు**

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు | పరిష్కరించినవి | పెండింగ్‌లో ఉన్నవి |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 19,430 | 5,222 | 14,208 |
| నిర్మల్ | 15,413 | 3,984 | 11,429 |
| ఖానాపూర్ | 1,910 | 1,184 | 7,26 |
| భైంసా | 10,800 | 1,950 | 8,850 |
| కాగజ్‌నగర్ | 1,845 | 150 | 1,695 |
| మంచిర్యాల | 22,954 | 4,021 | 18,933 |
| లక్షెట్టిపేట | 2,163 | 311 | 1,852 |
| చెన్నూర్ | 1,321 | 28 | 1,293 |
| నస్పూర్ | 4,921 | 4,024 | 897 |
| క్యాతన్‌పల్లి | 7,111 | 1,314 | 5,797 |
| బెల్లంపల్లి | 415 | 0 | 415 |
| మొత్తం | 88,283 | 22,188 | 66,095 |

### దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో మందమర్రి మున్సిపాలిటీలో 1/17 యాక్ట్ అమలులో ఉంది. అక్కడ లే-అవుట్లు భూముల క్రయవిక్రయాలకు ఎలాంటి అవకాశం లేదు. అది మినహాయిస్తే మిగిలిన 11 మున్సిపాలిటీల్లో 2020లో ఎల్ఆర్ఎస్ కోసం 88,283 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 22,188 దరఖాస్తులను పరిష్కరించారు. మిగిలిన 66,095లో కొన్నింటిని తిరస్కరించగా, దాదాపు 66 వేల పైచిలుకు దరఖాస్తులకు ఇప్పుడు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. అత్యధికంగా మంచిర్యాల మున్సిపాలిటీలో 18,933, ఆదిలాబాద్‌లో 14,208, నిర్మల్‌లో 11,429, భైంసాలో 8,950, క్యాతన్‌పల్లిలో 5,797 ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు ఉన్నాయి.

## బ్యాంకుల సేవలపై అవగాహన పెంచుకోవాలి

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 28: బ్యాంకులు అందిస్తున్న సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఆ మేరకు బ్యాంకర్లు చైతన్య పరచాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంచిర్యాలలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పోను బుధవారం ఆయన ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంకు కరీంనగర్ రీజియన్ డీజీఎం అపర్ణా రెడ్డి మాట్లాడుతూ తమ బ్యాంకు గత 105 ఏండ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నదని, 8.35 శాతం నుంచి తక్కువ వడ్డీ రేటుతో గృహ రుణాలను అందించే పథకాల్లో అత్యుత్తమంగా ఉందని వివరించారు. 8.80 శాతం వద్ద కార్ లోన్లు, ఎలక్ట్రిక్ కార్ లోన్‌లు, 8.70 శాతం వడ్డీతో స్వదేశీ చదువుల కోసం రూ.7.50 లక్షల వరకు అనుషంగిక భద్రత లేకుండా విద్యా రుణం, విదేశాల్లో చదువుకోవడానికి, ఎంపిక చేసిన ప్రీమియర్ సంస్థల కోసం రూ.40 లక్షల కొలేటరల్ ఉచిత విద్యా రుణం, ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు, సింగరేణి ఉద్యోగులు రూ.1.15 కోట్ల ఉచిత ప్రమాద బీమా కవరేజీతో జీతం ఖాతాలను తెరవడానికి బ్యాంక్ తో ఒప్పందాలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలమాసు కాంతయ్య, మంచిర్యాల జిల్లా రైస్ మిల్లర్ల సంఘం కార్యదర్శి చిలువేరు వైకుంఠం, రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్ కుమార్ ఝా, బ్యాంకు డీజీఎం మురళీకృష్ణ, వై సురేశ్, పీ శ్రీరామ్, వికాస్ కుమార్, మారుతి, మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్‌ని వివిధ శాఖలకు చెందిన బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## టీ డయాగ్నోస్టిక్స్ హబ్ ద్వారా విశిష్ట సేవలు

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 28: టీ డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను బుధవారం తనిఖీ చేశారు. హబ్‌లో నిర్వహించే పరీక్షలు, సేవలు, సిబ్బంది వివరాలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు హబ్ పరిధిలోని అన్ని దవాఖాన ద్వారా 28 రకాల వైద్య పరీక్షలకు సంబంధించి 29, 858 మంది నుంచి 52, 045 రక్త నమూనాలు సేకరించి 93, 261 పరీక్షలు నిర్వహించారని తెలిపారు. హబ్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ప్రగతి నివేదికలు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ హెడ్ బీ. సృజన, డా.ఎస్. షాలిని, మేనేజర్ నామాల వెంకటేశ్, రేడియోగ్రాఫర్ వీ ప్రసూనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.రమేశ్, డీఈవోజీ వివేక్ పాల్గొన్నారు.

**మహిళల రక్షణకు భరోసా 'సఖి కేంద్రం'**

బాలికలు, యువతులు, మహిళల రక్షణకు భరోసాగా సఖి కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహహింసకు గురైన మహిళలకు ఆశ్రయం కల్పించడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏలకవ్వ ఆశ్రమాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ, పరిసరాలను పరిశీలించారు. జిల్లాల బాలల పరిరక్షణ అధికారి ఆనంద్, సఖి కేంద్రం పరిపాలన అధికారి శ్రీలత పాల్గొన్నారు.

# సరిహద్దు దాటి సన్నగా మారి..


మన రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు మహారాష్ట్రలోని వెంకట్రావ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలు

- పొరుగు రాష్ట్రానికి చేరుతున్న రేషన్ బియ్యం
- కొనుగోలుకు ప్రత్యేకంగా దుకాణాల ఏర్పాటు
- ఇదే ప్రధాన వ్యాపారంగా చేసుకున్న కొందరు దళారులు
- పాలిష్ అనంతరం తిరిగి జిల్లాలోకి రవాణా
- ఎక్కువ ధరకు విక్రయిస్తూ దందా
- 'మాములుగా' తీసుకుంటున్న అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ): పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతున్నది. తిలాపాపం తలా పిడికెడు అన్న చందానా... ఇందులో అందరికీ వాటాలు ఉండడంతో, రాయితీ బియ్యం సరిహద్దు గుండా మహారాష్ట్రకు చేరుతున్నది. సరిహద్దు గ్రామాల్లో, పట్టణాల్లో అన్ని చోట్లా బియ్యం కొనుగోలు చేయడానికి దుకాణాలే వెలిశాయి. ఇక ఇక్కడి నుంచి సరిహద్దు దాటిన బియ్యం అక్కడి రైస్ మిల్లర్లు తీసుకొని పాలిష్ చేయడం, సన్న బియ్యంలో కలపడం చేస్తున్నారు. అయితే పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ విషయంలో నిఘా పెట్టినప్పటికీ, బియ్యం సరిహద్దులు దాటడం మాత్రం ఆగడం లేదు.

**ప్రత్యేక దుకాణాల ఏర్పాటు**

సిర్పూర్-టీ మండలంలోని వెంకట్రావ్‌పేట్ నుంచి రెండు కిలోమీటర్లు ప్రయాణిస్తే పెన్‌గంగ ఉంటుంది. నది ఒడ్డున పోడ్సా గ్రామం మహారాష్ట్రలోనిది. ఇక్కడి బియ్యాన్ని తీసుకోవడానికి అక్కడ నాలుగు భారీ దుకాణాలను ఏర్పాటు చేశారు. రెండు రోజులకు ఒక లారీ(సుమారు 30 టన్నులు) బియ్యం పోడ్సా గ్రామానికి జిల్లా నుంచి చేరుకుంటున్నాయి. పోడ్సాలో కొనుగోలు చేసిన బియ్యాన్ని మరో 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న బంగారు తలోడి, గోండ్ పిప్రికి చేరుస్తారు. ఇక్కడ రైస్ మిల్లుల్లో వీటికి పాలిష్ చేసి మళ్లీ ప్యాక్ చేసి, రాష్ట్రానికే చేరవేస్తున్నారు. మరో మార్గంలో రాజురా, వీరూర్, చంద్రాపూర్‌కు పీడీఎస్ బియ్యం అధికంగా వెళ్తున్నది.

**కొరవడిన నిఘా**

జిల్లాలోని చాలా గ్రామాల్లో రేషన్ లబ్ధిదారులు చౌక ధరల దుకాణాల వద్దే డీలర్లకు నేరుగా కిలోకు రూ. 10 నుంచి రూ. 12 కు బియ్యాన్ని విక్రయిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యం మహారాష్ట్రలో రూ. 18 నుంచి రూ. 22కు విక్రయిస్తున్నారు. ఇక్కడ పాలిష్ చేసి, ప్యాక్ చేసిన అనంతరం కిలోకు రూ. 40 నుంచి రూ. 50 వరకు అమ్ముతున్నారు. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి రెబ్బెన నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్-టి మీదుగా చౌక బియ్యం పొరుగు రాష్ట్రానికి తరలుతున్నది. జిల్లాలో కొంత మంది వ్యాపారులు ఇదే ప్రధాన వ్యాపారంగా చేసుకున్నారు. జిల్లా నుంచి అక్రమంగా మహారాష్ట్రకు తరలుతున్న బియ్యాన్ని పట్టుకునేందుకు ఎక్కడా చెక్‌పోస్టులు లేవు. ఒక్కోచోట పట్టుకున్నా ఆ తర్వాత 'మాములుగా' తీసుకొని వదిలేస్తున్నారు. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో అధికంగా ఈ వాహనాలు సరిహద్దు దాటుతున్నాయి. ఇలా అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న బియ్యం ఇప్పుడు అధికారుల వద్ద 3373 క్వింటాళ్లు ఉన్నదంటే, జిల్లాలో అక్రమ బియ్యం దందా ఏ స్థాయిలో జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

## మంచిర్యాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా చంద్రకళ

మంచిర్యాల, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా బుధవారం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగాయి. మంచిర్యాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా గద్వాల్ ఆర్డీవో డీ చంద్రకళ బదిలీపై రానున్నారు. ఇదే స్థానంలో పని చేసిన సిడాం దత్తు బోధన్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అలాగే మెదక్ ఆర్డీవో జీ. అంబదాస్ రాజేశ్వర్‌కు ఆదిలాబాద్ ఆర్డీవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఆదిలాబాద్ ప్రస్తుత ఆర్డీవో స్రవంతి వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

## మొండి బకాయి ఉన్న దుకాణాలకు తాళం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 28: ఏళ్ల తరబడి ఆస్తిపన్ను చెల్లించకుండా మొండి బకాయిదారులుగా నిలిచిన పలువురు యజమానులకు చెందిన దుకాణాలకు బుధవారం మున్సిపల్ అధికారులు తాళాలు వేశారు. మంచిర్యాలలోని కూరగాయల మార్కెట్‌లో ఖమరున్నీసా బేగం పేరుమీద ఏడు దుకాణాలు ఉండగా, వాటికి 2021 నుంచి ఆస్తిపన్ను చెల్లించడం లేదు. మూడేళ్లకు కలిసి రూ. 2.05 లక్షలు ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు చెల్లించలేదు. దీంతో కింద అంతస్తులో ఉన్న మూడు, పైఅంతస్థులో ఉన్న నాలుగు దుకాణాలకు తాళాలు వేశారు. దీంతోపాటే మజీద్ కమిటీకి చెందిన దుకాణాలకు సంబంధించిన ఆస్తిపన్ను రూ. 2.40 లక్షలు ఉండగా, వాటికి కూడా తాళాలు వేసేందుకు సిద్ధమయ్యారు. అయితే మజీద్ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యను కలిసి తమకు గడువు కావాలని కోరారు. నేరుగా మజీద్ వద్దకు వెళ్లి కమిటీ సభ్యులతో మాట్లాడిన చైర్మన్ మార్చి ఐదో తేదీలోపు పన్ను చెల్లించాలని సూచించారు.


దుకాణానికి తాళం వేస్తున్న మున్సిపల్ అధికారులు

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


మంచిర్యాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


గేటు బయట నిలబడిన ఆలస్యంగా వచ్చిన విద్యార్థి


పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థిని

### మంచిర్యాల జిల్లాలో 6711 మంది విద్యార్థులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షను మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 6,711 మంది విద్యార్థులు రాశారు. వీరిలో ఇంటర్ విద్యార్థులు 5,672 మంది ఉండగా ఒకేషనల్ విద్యార్థులు 1,039 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 25 సెంటర్లను ఏర్పాటు చేయగా, మొదటి రోజు పరీక్షకు 484 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులను సిబ్బం ది పూర్తిస్థాయిలో తనిఖీ చేసి సెంటర్లలోకి పంపించారు.

**ఆలస్యంగా రాక.. విద్యార్థికి నో ఎంట్రీ**

మంచిర్యాల పట్టణంలోని ఎస్ఆర్ కాలేజీలో ఏఈటీ ( ఆటోమొబైల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్) కోర్సు చదివే సుందిళ్ల కార్తీక్ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌కు ఉదయం 9.20 గంటలకు చేరుకున్నాడు. 20 నిమిషాలు ఆలస్యంగా రావడంతో కార్తీక్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్ పరీక్షకు అనుమతించలేదు. పరీక్షా కేంద్రాలను పట్టణ సీఐ ఎస్పీ రవీందర్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

**పరీక్షా కేంద్రం తనిఖీ**

నస్పూర్,ఫిబ్రవరి 28 : జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ఆదర్శ పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శైలజతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ తనిఖీ చేశారు. అనంతరం డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి మిమ్స్ జూనియర్ కళాశాలలో కేంద్రాన్ని తనిఖీ చేశారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని పీటీజీ సెంటర్, కాగజ్ నగర్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ ను కలెక్టర్ బోర్కడే హేమంత్, రెబ్బెన జూనియర్ కళాశాల లో కేంద్రాన్ని డీఐఈవో నైతం శంకర్, డెక్ సభ్యుడు రాజయ్య, స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్పీ సురేశ్ కుమార్ తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ 4,745, ఒకేషనల్ 880 మొత్తం 5,625 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. ఇందులో జనరల్ 4,521, ఒకేషనల్ 798 మంది హాజరు కాగా, 306 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి నైతం శంకర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.


పరీక్ష రాసేందుకు వస్తున్న దివ్యాంగుడు


ఆసిఫాబాద్ : పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న ప్రభుత్వ కళాశాల సిబ్బంది


నస్పూర్ : పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్